కథ

# పుస్తకాలు

ఇటాలియన్ మూలం : ఇటాకో కాల్వినో

తెలుగు : ముక్తవరం పార్థసారథి



పుణ్యభూమి పందూరియా ప్రపంచదేశాలకే తలమానికం. ఒక నాడు అక్కడి సైనికాధికారులకో భయంకరమైన సత్యం తెలిసివచ్చింది. పుస్తకాలలో రాసిన అబద్ధాలన్నీ చదివి సాధారణ పౌరులు (పాపం, మంచివాళ్లు!) మిలటరీ వ్యతిరేక భావనలు పెంచుకునే ప్రమాదం లేకపోలేదు. జనరల్స్, కమాండర్స్ కూడా పొరబాట్లు చేస్తారని, రాసిన పుస్తకాలు తాము స్వయంగా చదవలేదూ. సైన్యాధికారుల వల్లే దేశాలకు రెండూ నాశనమవుతాయట. హన్నా! ఎన్నెన్ని అసత్యాలు.

ఒక అత్యవసర సమావేశంలో ఆర్మీ హెడ్ బ్రాస్ ఈ సమస్య క్షుణ్ణంగా చర్చించారు. శత్రువును నిరోధించడం తమకు తెలిసిన విద్య. మరోదేశం మీదికి పొత్తులు నడపవచ్చు. బాంబులు కురిపించవచ్చు. కాని పుస్తకాలను నిషేధించడం సాధ్యమా? సమర్థుడైన జనరల్ ఫెడినాతో ఒక ఎంక్వయిరీ కమిషన్ ఏర్పాటు చేశారు. పందూరియాలో వున్న గ్రంథాలయాలలోని పుస్తకాలన్నీ చదివి నివేదిక సమర్పించారు.

రాజధానిలోని ముఖ్య గ్రంథాలయం నుండి పని ప్రారంభించింది కమిషన్. అక్కడి అనేక గదుల్లో, హాళ్లలోని వేలాది అలమారాలలో పేర్చిన లక్షలాది పుస్తకాలు చదవడం సాధ్యమా? కొన్ని పుస్తకాలైతే చేతికి అందనంత ఎత్తున పై అరల్లో వున్నాయి. అటూ ఇటూ పరిగెత్తే ఎలుకలు మాత్రమే చదవగలవు వాటిని. కమిషన్ ఏర్పాటు చేశారు గాని, బడ్జెట్ కేటాయింపు కాకపోవడంతో అదనపు సిబ్బందిని సమకూర్చలేకపోయారు.

భోరున వర్షం కురుస్తున్న ఒక ఉదయం సైనిక పటాలంతో గ్రంథాలయాన్ని తమ కంట్రోల్‌లోకి తీసుకుంది. గుర్రం దిగి, షేవ్ చేసుకున్న మొహాన్ని తడుముకుంటూ, మెళ్లో వేళ్లాడే కళ్లద్దాలను సవరించుకుంటూ మెట్లెక్కాడు జనరల్.

కారులో బ్రీఫ్ కేసుల్తో వచ్చిన మరో నలుగురు ఉద్యోగులు ఆయన్ని అనుసరించారు. లైబ్రరీ ప్రాంగణంలో సైనికులు గుడారం వేసుకున్నారు. గుర్రాలనూ, కంచరగాడిదలనూ అక్కడే కట్టేసి గడ్డిమోపులు కూడా విప్పారు. వంటసామానూ, ఒక రేడియో, జండాలూ వుండక తప్పదు గదా.

ప్రతి ద్వారం దగ్గిరా ఒక హెచ్చరిక. ప్రవేశానికి అనుమతి లేదు. అదీ సరిపోక సాయుధులైన ఇద్దరు సెంట్రీలను కూడా కాపలా పెట్టారు. రోజూ లైబ్రరీకి వచ్చే పుస్తకాభిమానులకీ నిషేధం ఎందుకో అంతుబట్టలేదు. సైనికులకిక్కడేం పని? ఒకరూ ఇద్దరూ కాదాయే బెటాలియన్ మొత్తం వచ్చింది. శత్రురాజ్యాన్ని జయించినట్టుగా జండాలు కూడా పాతారు. ఒక ముసలి లైబ్రేరియన్‌కు తప్ప ఇతర సిబ్బందిని కూడా లోపలకి అనుమతించలేదు.

మొదట, తను చెయ్యాల్సిన పనిని అంచనా వేసుకున్నాడు జనరల్ ఫెడినా. లైబ్రరీలోని పుస్తకాలన్నీ చదివితే తప్ప అసిస్టెంట్లెవరూ అక్కడి నుంచి కదలకూడదని ఆర్డర్ జారీ చేశాడు. ఏయే పుస్తకాలలో ఏ విషయమున్నదో టూకీగా చెప్పడానికి లైబ్రేరియన్ సహాయం చేస్తాడు. చదవడానికి ఏకాగ్రత అవసరం. అందువల్ల, పాఠకులు మరి దేని గురించీ ఆలోచించకూడదు. భోజనం ఇతర సదుపాయాలూ చూడడం తన బాధ్యత. అక్కడే వంటలు ప్రారంభించడంతో ఎముకలు కొరికే చలికాలంలో కూడా లైబ్రరీలో మాత్రం వాతావరణం చెమటలు గక్కేంత వేడిగా మారింది. అలసిన వాళ్లు సేదతీరడానికి పడకలూ, వాటి పక్కనే ఎలుకల బోనులూ అమర్చారు.

ఒక్కొక్క అధికారీ ఒక్కో సబ్జెక్టుకు సంబంధించిన పుస్తకాలు క్షుణ్ణంగా చదవాలి. చరిత్ర తీసుకుంటే, ఒక్కొక్కరికీ ఒక్కో శతాబ్దం కేటాయించారు. అసిస్టెంట్లు చదివిన పుస్తకాలు, జనరల్ మరోసారి తిరగేసి, అందులో నిషేధించవలసిందేమీ లేకపోతే ఓ అధికార ముద్ర వేస్తాడు. ఎటూ తేల్చుకోలేని పుస్తకాలను మిలటరీ న్యాయస్థానానికి తదుపరి పరిశీలనకు సమర్పిస్తారు.

పఠనాకార్యక్రమం ప్రారంభమైంది. ప్రతి సాయంత్రం జనరల్ ఫెడినా, రేడియో ద్వారా తన రిపోర్టును హెడ్ క్వార్టర్స్‌కు పంపిస్తారు. ''చదివిన పుస్తకాల సంఖ్య, అభ్యంతరకర పేజీలు, విషయం, అందరూ చదవడానికి యోగ్యమైన పుస్తకాలు'' అంటూ నివేదిక రూపొందించారు. అప్పుడప్పుడూ కొన్ని అమూల్యమైన ప్రాచీన గ్రంథాలను ఆకలిగా వున్న ఏ కంచరగాడిదో భోంచేసిన సందర్భాలు లేకపోలేదు. కాని ఇలాంటివి రిపోర్టు చేసి హెడ్ క్వార్టర్స్‌లోని పెద్దలను విసిగించడం భావ్యం కాదు.

అయితే! పై వాళ్లదాకా చేరని మరెన్నో ముఖ్య పరిణామాలు కూడా అక్కడ జరగక పోలేదు. చదివిన కొద్దీ, పుస్తకాల సంఖ్య పెరుగుతున్నదేతప్ప తరగడం లేదు. ముసలి లైబ్రేరియన్ యథాశక్తి సహాయం చెయ్యలేదు కాదు గాని అతడి వల్ల ఉపయోగం అంతగా కనిపించలేదు. పాఠకులు ఏ దృష్టితో గత చరిత్రనో చదవాలో వాళ్లకు అంతుబట్టలేదు. ఇద్దరు రాజుల మధ్య యుద్ధం జరిగింది. చరిత్రకారుడు ఒకడు మంచివాడంటాడు. మరొకడు దుర్మార్గుడట. వాడి అభిప్రాయం మన మీద రుద్దుతాడెందుకు?

ఇది హెడ్ క్వార్టర్స్‌కు నివేదించాల్సిన విషయమే. కళ్లద్దాలు సవరించుకుంటూ లైబ్రేరియన్ వచ్చి. 'తొందరపడకండి. మరో చోట, మరొకడు రాసిన పుస్తకంలో దీనికి పూర్తి భిన్నమైన అభిప్రాయాలు కూడా వ్యక్తం చేస్తాడు. చరిత్ర ఇలాగే వుంటుంది.' అంటూ నసుగుతాడు. కాని.... ఇంత గజిబిజిగా పరస్పర వ్యతిరేకమైన అభిప్రాయాలను వ్యక్తం చేసే చరిత్ర చదివి పాఠకులేం తెలుసుకోవాలి? ప్రస్తుత పాలకుల గురించిన వాళ్ల అభిప్రాయాలు కూడా వీటితో ప్రభావితం కాదా? యుద్ధాలు (క్యూసెక్స్)అనాగరికమైనవీ! దుర్మార్గమైనవీ అని రాశారే! 'తొందరపడకు క్యూసేడ్స్‌ను సమర్థించిన పుస్తకాలు కూడా వుంటాయి. వాటినే అందరూ చదవాలని ఆదేశాలు జారీ చేద్దాం' అన్నాడు మరో అధికారి.

చదివిన పుస్తకాలు సంఖ్య పెరుగుతూనే వుంది కాని జనరల్ ఫెరినాకు ఏ పుస్తకం మీద స్టాంపు వెయ్యాలనిపించలేదు. అందరూ చదవదగిన నవలలూ కూడా కనిపించలేదు. పెద్దలంటే గౌరవం లేని పిల్లల గురించి కథలు రాస్తారేం ఈ రచయితలు! చరిత్ర, ఆర్థిక, తత్వశాస్త్రాలు ఏ పుస్తకంలో చేసినా ఏదో ప్రశ్నించేతనమే. ఇలాగైతే సమాజాన్ని అదుపులో పెట్టడం ఎవరితరం? జనరల్ ఫెడినా తన సహచరులతో సుదీర్ఘంగా చర్చలు జరిపాడు. పుస్తకాలు ప్రజాహితానికి ప్రమాదకరమైన ఏకగ్రీవ నిర్ణయానికి వచ్చారందరూ.

ఈలోగా చదివి, చదివి సైనికులకు విసుగొచ్చింది అంతేకాదు, ఈ కార్యక్రమంలో తన అసిస్టెంట్ల బుర్రలు కూడా పాడవుతాయనే భయం పట్టుకుంది జనరల్‌కి. కాని ఎవరూ చదివి చెప్పకపోతే తను స్టాంపు ఎలా వెయ్యగలడు?

వారాలు, నెలలు గడిచాయి. రోజు రోజుకూ చలి పెరిగింది. కమిషన్ సభ్యులు, సిబ్బంది అందరూ ముడుచుకు కూర్చుని ఏదో ఒక పుస్తకం తిరగేస్తూనే వున్నారుగాని ప్రగతి మాత్రం కనిపించలేదు. హెడ్ క్వార్టర్స్‌కి రిపోర్టు చెయ్యడానికి జనరల్ దగ్గిర తాజా సమాచారమేమీ లేదు. కమిషన్ నియమించిన చీఫ్ ఆఫ్ స్టాఫ్‌కు చిర్రెత్తుకొచ్చింది. ఎవరూ పనిచేయనప్పుడు, ఎందుకీ ఎంక్వయిరీ? ఇన్నాళ్లు చేసిన పనికి ఒక నివేదిక తయారు చేసి జనరల్‌ను తిరిగి రమ్మని ఆదేశాలు జారీచేశాడు.

ఫెడినా, అతడి అనుచరులకు ఏం చెయ్యాలో తోచలేదు. అందరూ చదవడానికి అలవాటుపడ్డారు. చాలా మందికి ఇదో మంచి కాలక్షేపంగా వుంది. పుస్తకం చేతిలో లేకపోతే ఏదో వెలితిగా వుంటుంది. పరిస్థితి ఇంత త్వరగా మారుతుందని ఎవరూ ఊహించలేదు. పుస్తక జ్ఞానంతో లోకంలోని సంక్లిష్టత

**ఒక్కొక్క అధికారీ ఒక్కో సబ్జెక్టుకు సంబంధించిన పుస్తకాలు క్షుణ్ణంగా చదవాలి. చరిత్ర తీసుకుంటే, ఒక్కొక్కరికీ ఒక్కో శతాబ్దం కేటాయించారు. అసిస్టెంట్లు చదివిన పుస్తకాలు, జనరల్ మరోసారి తిరగేసి, అందులో నిషేధించవలసిందేమీ లేకపోతే ఓ అధికార ముద్ర వేస్తాడు. ఎటూ తేల్చుకోలేని పుస్తకాలను మిలటరీ న్యాయస్థానానికి తదుపరి పరిశీలనకు సమర్పిస్తారు.**

ఇప్పుడిప్పుడే అర్థమవుతున్నట్లుగా వుంది. ఇన్నాళ్లు వూహించని కొత్త కోణాలు ఆవిష్కృతమవుతున్నాయి. తెలియని మరో లోకాన్ని చూడగలుగుతున్నారు. పుస్తక ప్రపంచాన్ని వదలాలంటే దిగులాగా వుంది. రిపోర్టులో ఏం రాయాలి? అక్షరాల విశ్వంలో అనంతమైన తమ ప్రయాణాన్ని ఎలా అర్థాంతరంగా ముగించాలో? కాని...తప్పదు. ఆజ్ఞను శిరసావహించడమే సైనికుడి కర్తవ్యం.

మంచు కురుస్తున్న సాయం సమయాన, అస్తమిస్తున్న సూర్యుణ్నీ, చెట్టమీద ఇంకా విచ్చుకోని మొగ్గల్నీ చూడగలగడం ఒక గొప్ప అనుభవం. చీకటి పడుతోంది. ఓ కుర్రవాడు గొంతెత్తి కవితాగానం చేస్తాడు. ఎవరూ బిగ్గరగా చదవొద్దని ఆదేశించాడు జనరల్. కాని మైమరిచిన యువకులు ఆ ఆంక్షల్ని పట్టించుకోరు. ముసలి లైబ్రేరియన్ సహాయంతో రిపోర్టు తయారైంది.

నివేదిక అందజేయడానికి కమిషన్ సభ్యులు చీఫ్ ఆఫ్ స్టాఫ్ ముందు హాజరయ్యారు. జనరల్ ఫెడినా గొంతు సవరించుకొని రిపోర్టు పూర్తి పాఠం చదివాడు. ఆదిమానవుని ఆవిర్భావం నుంచి ఆధునిక కాలం దాకా దశల వారీగా రాసిన చరిత్ర అది. అందరు తాత్వికుల, శాస్త్రజ్ఞుల, కళాకారుల ఆలోచనలు, అనుభవాల సారం. ప్రపంచ చరిత్రలో ఒక భాగం పందూరియా చరిత్ర. వేల సంవత్సరాల మానవపరిణామక్రమంలో ఎన్ని విజయాలు, ఎన్ని పరాజయాలు, ఎన్ని నాగరికతలు, ప్రభవించి పరిఢవిల్లి పతనమైనాయో! దేశాలను కొల్లగొట్టిన వాళ్లే రాజ్యాలను పునర్నిర్మించారు. పరాజితుడైన రాజవంశీకులు బానిసలుగా మారిన సందర్భాలు ఎన్నో. ప్రాణాలొడ్డి పోరాడిన అనామకుల జీవితాలను మహాకావ్యంగా మలిచారు. మొత్తం మీద అంతా గజిబిజిగా వుంది. గతాన్ని తలుచుకుంటే ఫలాని వాళ్లు మాత్రమే మంచి చేశారని నిర్ధారణగా చెప్పలేం. అన్ని కాలాలలో అన్ని సమాజాలలోనూ కొత్త భావనలు అలజడి రేపాయి. నియమాలను ధిక్కరించిన వాళ్లను లోకం ఎప్పుడూ క్షమించలేదు. రిపోర్టు చదువుతూ, జనరల్ ఫెడినా తన మాటల్ని తనే నమ్మలేకపోయాడు. తమ సహోద్యోగి ఇలా మారినందుకు, మిగతా జనరల్స్‌కు కోపం వచ్చింది. క్రమశిక్షణోల్లంఘనలకు వీణ్ని కోర్టుమార్షల్ చెయ్యాలన్నారు. లేదా కనీసం డిస్మిస్ చెయ్యాలి. ఏ శిక్ష విధించినా 'స్కాండల్'గానే మారుతుంది. అందువల్ల, ఫెడినా ఇతర కమిషన్ సభ్యులతో బలవంతంగా తక్షణ పదవీ విరమణ చేయించారు.

కారణం: విధి నిర్వహణ బాధ్యతతో ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. విశ్రాంతి అవసరం. యూనిఫాం లేని ఫెడినా, అతని మిత్రులూ ఇప్పుడు అలవాటు ప్రకారం రోజంతా లైబ్రరీలోనే గడుపుతారు.

★